సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 4 । మే । 2023



బీటీ కళాశాలకు పూర్వ వైభవం దిశగా ప్రభుత్వ కృషి

బీటీ కళాశాలకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. - 8లో



అక్రమార్కుడి చెరనుంచి భూమి స్వాధీనం

అక్రమార్కుడి చెరలో ఉన్న భూమిని ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.70	రూ.80
రెండోరకం	రూ.50	రూ.68

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 499 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	481	515
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 220.08 కిలోలు

న్యూస్‌రీల్

మదనపల్లె ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా మంజులత

మదనపల్లె : మదనపల్లె ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఆరవీటి మంజులత బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా గురుజాలలో పని చేస్తున్న ఆమె మదనపల్లె కోర్టుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న జి.శ్రీనివాసరెడ్డి ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంజులత బాధ్యతలు స్వీకరించారు.

నేడు నృసింహ జయంతి

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీనృసింహ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కృష్ణ, అనిల్‌స్వామి తెలిపారు. గురువారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. 9.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంకాలం గ్రామోత్సవం ఉంటుందని వివరించారు.

బాధ్యతల స్వీకరణ



డైరెక్టర్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న నిర్మలాదేవి

సంబేపల్లె : ఆంధ్రప్రదేశ్ జానపదాలు, నాట్యకళలు, హస్తకళల డైరెక్టర్‌గా అన్నమయ్యజిల్లా సంబేపల్లె మండలం గుట్టపల్లెకు చెందిన ఎం.నిర్మాలాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మాలాదేవి మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

ఒంటిమిట్టలో కర్నూలు కలెక్టర్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ప్రదక్షణ కావించి, సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో అర్చకులు వారిని సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు పీర్ కమిటీకి శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్ : పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ పురస్కారాల కోసం నిర్వహించే సర్వేలో భాగంగా పీర్ కమిటీ సభ్యులకు గురువారం జెడ్పీలో ఉదయం 10 గంటలకు శిక్షణ ప్రారంభించనున్నట్లు జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి మండలం నుంచి ఒక గ్రామ పంచాయతీ సర్పంచ్, ఒక పంచాయతీ సెక్రటరీ, ఒక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు, మండల విస్తరణ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్ తప్పక హాజరు కావాలని కోరారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన పుణ్య క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం కార్యాక్రమాన్ని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ ప్రారంభించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, శాంతి హోమం, రాత్రి శేష వాహన సేవ వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే నేడు నరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి (పెంచలకోన) బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు బద్వేలు డిపో నుంచి పెంచలకోనకు 12 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తొలకరి.. సాగుదారి



జిల్లాలో కొద్దిరోజులుగా అదునుకు వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముందస్తు ఖరీఫ్‌తో చీడపీడల నుంచి బయటపడొచ్చనే ఆశతో రైతులు ముందుకు సాగుతున్నారు. దీనికితోడు వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ముందస్తు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు
- జిల్లాలో 60 వేల హెక్టార్లలో సాగుకు సన్నాహాలు



వర్షం కురవడంతో దుక్కులు చేస్తున్న రైతు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రధానం. వర్షాధారంగా జిల్లా పరిధిలో వేరుశనగ, కంది, ఆముదం, అలసంద, ఉలవ తదితర పంటలతో పాటు ఆకుకూరలు, కూరగాయల తోటలు అధికంగా సాగు చేస్తారు. ఈ క్రమంలోనే రబీ సాగును పూర్తి చేసుకుని సమీపిస్తున్న ఖరీఫ్ సాగు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. అందుకు అనుగుణంగా అదునుకు వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగు చేయాలని రైతులు పొలాలను దున్ని వాటిలో ఎరువులు చల్లి సాగుకు ప్రయత్నాలను మొదలుపెట్టారు. వ్యవసాయ అధికారులు కూడా రైతులతో సమావేశాలను ఏర్పాటు చేసి సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై సూచనలు ఇస్తున్నారు.

60 వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు

ఖరీఫ్ సీజన్‌లో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 60 వేల హెక్టార్లకు పైగా వర్షాధారపు పంటలను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు జిల్లాలో గత ఏడాది 30 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు అయింది. అంతకు మునుపు ఏడాది 60 వేల హెక్టార్లలో పంట సాగైనట్లు సమాచారం. ఈ ఏడాది కూడా 60 వేల హెక్టార్లలో వేరుశనగ పంటతో పాటు కంది, అలసంద, ఆముదం, పెసర, సజ్జ, రాగులు, జొన్న, మినుము, ఉలవ తదితర పంటలు సాగవుతాయని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ముందస్తుగా వర్షాలు పడుతుండటంతో రైతులు మే నెల చివరి, జూన్ మొదటి వారాలలోనే పంటలను సాగు చేయడం వల్ల తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చన్న ఆశతో ముందుకు కదులుతున్నారు.

లోతు దుక్కులతో మేలు

లోతు దుక్కులు దున్నినప్పుడు భూమిలో ఉండే పురుగులు తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుంది. భూమిలో దాగి ఉన్న లేదా నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయి. దుక్కిలో బయటపడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయి. కనుక తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గడానికి అవకాశం ఉంటుంది. భూమిలో 9 అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం శ్రేయస్కరం.

పంట మార్పిడి తప్పనిసరి



భూమిలో ఏటా పంట మార్పిడి చేసుకోవాలి. రైతులు ఒకే రకమైన పంటను వరుసగా సాగు చేస్తూ దిగుబడులు రాక నష్టపోతున్నారు. పంట మార్పిడి నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు తేమను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. వివిధ రకాల వేరు వ్యవస్థలు కలిగి భిన్నంగా పెరిగే పైర్లను పంట మార్పిడి కోసం ఎంపిక చేసుకోవాలి. వేరుశనగ, కంది, ఆముదం, పొద్దుతిరుగుడు వంటి పైర్లు నేల లోపలి నుంచి పోషకాలు తీసుకుంటాయి. పోషకాలు ఎక్కువగా తీసుకునే నువ్వులు, పొద్దుతిరుగుడు వంటి పంటలకు భూమికి పోషకాలు సమకూర్చే పైర్లతో పంట మార్పిడి చేసుకోవాలి. ఇవి బెట్ట పరిస్థితులను తట్టుకుంటాయి. వరుసగా పప్పుధాన్యాల పంటలు కాకుండా నూనె పంటలు సాగు చేయాలి. పంటమార్పిడి చేసేటప్పుడు అనుకూలమైన పంటలు ఎంచుకోకపోతే చీడపీడల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశించి నష్టపరుస్తాయి.

-దివాకర్‌బాబు,రాయచోటి ఏఓ

లోతు దుక్కులతో కలుపు నిర్మూలన



తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పొలాల్లో పెరిగి పంటలు నాశనం చేస్తాయి. కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. తుంగ, గరికల వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వల్ల నివారణ కష్టం అవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినప్పుడు ఈ కలుపు వేర్లు, దుంపలు ఏరి వీటిని అరికట్టవచ్చు. వేసవిలో లోతుగా దున్ని తొలకరి వర్షాలకు గొర్రు, గుంటులతో దున్నినప్పుడు నేల బాగా గుల్ల బారుతుంది. పైర్ల వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. గత ఏడాది వేరుశనగతో పాటు సాగు చేసిన పత్తి, కంది, ఆముదం కట్టెలను తొలగించి పొలంలోనే కాల్చివేయాలి. నీటిలభ్యత ఉన్న రైతులు పెంట కుప్పలపై అడపా దడపా నీటిని చిలకరించడం వల్ల తొందరగా ఎరువుగా మారుతుంది.

– ఉమామహేశ్వరీదేవి, జిల్లా వ్యవసాయాధికారి, అన్నమయ్య జిల్లా

రేపు జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈ నెల 5వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్‌లోని 'ఒ' బ్లాక్‌లో నిర్వహించే జాబ్‌మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ప్యానాసోనిక్ కంపెనీ వారు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ మెకానికల్ ఉత్తీర్ణులై 18–30 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి శ్రీసిటీ, నాయుడుపేటలో ఉద్యోగం కల్పిస్తారన్నారు. రూ.13,500 నుంచి రూ.15,500 వరకు వేతనం ఉంటుందని, ఆసక్తిగల పురుష అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని.. ఇతర వివరాలకు 99590 22904, 78929 33270 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

7న అల్లూరి శతవర్ధంతి కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు: ఈ నెల 7వ తేదీన పర్యాటక కేంద్రమైన గండికోటలో అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన పర్యాటక, విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌత్ జోన్ కల్చరల్స్ (తంజావూరు) ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్లూరి జీవిత చరిత్రపై వ్యాసరచన , క్విజ్, రంగోళి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాలుంటాయన్నారు. గండికోటకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్టఫర్, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప రాయుడి కోనేటి విహారం



తెప్పోత్సవంలో ఆండాళ్ తాయారుతో కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం తెప్పోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు సాయంత్రం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేసి పల్లకీలో కొలువుదీర్చారు. అర్చకులు మయూరం తివిక్రమ్ బృందం వేదమంత్రోచ్చాటనలతో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో సిద్ధం చేసి ఉన్న తెప్పలో కొలువుదీర్చారు. పూజల అనంతరం మంగళహారతులు ఇచ్చి మొదట వేదమంత్రోచ్చాటనలతో తెప్పను పుష్కరిణిలో తొలి ప్రదక్షిణ చేయించారు. రెండోమారు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు గాయకులు భక్తిగీతాలాపనతో తెప్పతో ప్రదక్షిణ నిర్వహించారు. మూడోమారు స్వామి, అమ్మవారు మంగళ వాయిద్యాల మధ్య ప్రదక్షణ చేశారు. మంగళ హారతులు అనంతరం స్వామి, అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

- ఆధునికంగా రూపుదిద్దిన కోనేటిలో తొలిసారి తెప్పోత్సవం నిర్వహించారు. చుట్టూ రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు. స్వామి పుష్కరిణిలో విహరిస్తుండగా భక్తులు గోవింద నామ స్మరణలతో తన్మయులయ్యారు. గురువారం రెండవరోజు తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

కంటికి రెప్పలా వీఐపీల భద్రత



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

రాయచోటి: ఎలాంటి విపత్కర పరిస్థితిలోనైనా అంచనా వేసి ధైర్యంగా ఎదుర్కొనేందుకు అంగరక్షకులు సిద్ధంగా ఉండాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు అన్నారు. రాయచోటి పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో అంగరక్షకుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఎస్పీ, అదనపు ఎస్పీలకు భద్రతగా ఉన్న పర్సనల్ (అంగ రక్షకుల) సెక్యూరిటీ ఆఫీసర్లకు, పోలీసు పెరేడ్ మైదానంలో మొదటి విడత శిక్షణ ముగిసిందన్నారు. రక్షణగా ఉండే అంగరక్షకులకు నిపుణులతో మెరుగైన శిక్షణ ఇప్పించామని తెలిపారు. విధి నిర్వహణలో నైపుణ్యం చూపుతూ వీఐపీ, వీవీఐపీలకు కంటికి రెప్పలా భద్రత కల్పించాలన్నారు. ఎక్కడ కూడా రాజీ పడకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, ఆయుధాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి మహబూబ్ బాషా, జిల్లా అంగరక్షకుల ఇన్‌చార్జ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.జావిద్, జిల్లా పోలీసు వాహనాల అధికారి ఆర్ఐ మహబూబ్ వలీ, ఆర్ఎస్ఐ అమరనాథ్ రెడ్డి, ఏఆర్ ఎస్ఐ గుణశేఖర్, అంగరక్షకులు పాల్గొన్నారు.

రక్తహీనత రహిత జిల్లాగా మారుద్దాం

వైద్యాధికారులను ఆదేశించిన కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి : అన్నమయ్య జిల్లాను రక్తహీనత రహిత జిల్లాగా మార్చేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. అందుకు అవసరమైన ఎన్‌సీడీ స్క్రీనింగ్‌తో పాటు ప్రజలకు డిజిటల్ ఆరోగ్య ఐడీని ఆరోగ్య కార్యకర్తలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌సీడీ–సీడీ సర్వే, ఏఏఎస్ఎం ఫీడ్‌బ్యాక్, గ్రీవెన్స్, అనీమియా తదితర అంశాలపై వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లతో వయస్సు నిండకుండానే జబ్బులు చుట్టుముడుతున్నాయన్నారు. వ్యాధి ముదిరిపోయే వరకు గుర్తించకపోవడంతో ప్రాణాంతకంగా మారుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ)సహా పలు రకాల స్క్రీనింగ్ పరీక్షలను ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వేలో గుర్తించిన అసాంక్రమిక వ్యాధుల బాధితులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్యసేవలు అందిస్తుందన్న విషయాన్ని ప్రజలకు తెలియపరచాలన్నారు. అలాగే గర్భిణులకు హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పులు లేకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య నిలయాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

సంపూర్ణ ఆరోగ్య నిలయాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. తనిఖీలో ఆసుపత్రిలోని ఓపీ, మందుల నిల్వ రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. అర్బన్ ఏరియాలలో ఎన్‌సీడీ సీడీ సర్వే విషయంలో వచ్చేవారానికంతా పురోగతి కనిపించాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా హద్దురాళ్లు నాటే ప్రక్రియ

ఈ నెల 7లోగా ప్రణాళికాబద్ధంగా హద్దురాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేయాలని సర్వేయర్లను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా హద్దురాళ్ల పాతే అంశంపై సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్లను తప్పనిసరిగా పాతించాలని సర్వేయర్లకు సూచించారు. వంద మీటర్లకు హద్దురాయి నాటాలన్నారు. ఇంకా ఎక్కడ అవసరం ఉందో ఆ వివరాలు పంపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ సత్యనారాయణ, సర్వే శాఖ ఏడీ జయరాజ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

బడులకు భద్రత

- హైస్కూళ్లల్లో నైట్‌వాచ్‌మెన్‌ల నియామకం
- తొలి విడతలో 227 మంది నియామకానికి చర్యలు
- నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం

మదనపల్లె సిటీ: విద్యకు అధిక ప్రాధ్యానత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో 227 పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్లను నియమించనుంది. మనబడి–నాడు–నేడు పథకంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కోట్లాది రూపాయల వ్యయంతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది. అయితే కొన్ని చోట్ల పాఠశాలల్లో నైట్‌వాచ్‌మెన్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయి. అంతే కాకుండా పాఠశాలల్లో చోరీలు, పాఠశాలల్లో విలువలైన వస్తువులు ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటివి చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాడు–నేడు మొదటి విడత అభివృద్ధి చేసిన పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్లను నియమించనుంది. దీనికి సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలపై పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది.

వాచ్‌మెన్ విధులు

- పాఠశాల మూసే ముందుగానే హాజరు కావాలి.
- పాఠశాల వద్ద అన్ని రోజుల్లోనూ విధులు నిర్వర్తించాలి.



మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల

- పాఠశాల ఆస్తికి ఎలాంటి నష్టం కలగకుండా రక్షకుడిగా పని చేయాలి.
- ఎక్కడైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినప్పుడు స్కూల్ హెచ్ఎం, పోలీసు స్టేషన్, అగ్నిమాపక విభాగాలకు సమాచారం అందించాలి.
- ఆర్వో ప్లాంట్‌ను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పోయడం వంటి పనులు చేయాలి.

మార్గదర్శకాలు

- పాఠశాలల పేరెంట్ కమిటీల ద్వారా నైట్ వాచ్‌మెన్ నియామకం ఉంటుంది.
- పాఠశాలల్లో పని చేస్తున్న ఆయా కమ్ కుక్ భర్తలకు ప్రాధాన్యత ఇస్తారు.
- మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యత ఉంటుంది.
- 60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలి.
- ఎంపికైన వారికి గౌరవ వేతనం ఆయా పాఠశాలల టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ నుంచి చెల్లిస్తారు.

ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆస్తుల పరిరక్షణకు నైట్‌వాచ్‌మెన్‌లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషం. ఈ నెలలో వాచ్‌మెన్లను నియమిస్తారు.

-క్రిష్టప్ప,డీవైఈఓ, మదనపల్లె

జిల్లా మొత్తం ఎంపికైన పాఠశాలలు: 227



మండలం	వాచ్‌మెన్‌కు ఎంపికైన పాఠశాలల సంఖ్య	మండలం	వాచ్‌మెన్‌కు ఎంపికైన పాఠశాలల సంఖ్య
బి.కొత్తకోట	7	ఓబులవారిపల్లె	9
చిన్నమండెం	6	పెద్దమండ్యం	5
చిట్వేలి	5	పీటీఎం	8
గాలివీడు	7	పెనగలూరు	7
గుర్రంకొండ	8	పీలేరు	15
కలకడ	7	పుల్లంపేట	6
కలికిరి	7	రాజంపేట	12
రైల్వేకోడూరు	7	రామాపురం	6
కురబలకోట	4	రామసముద్రం	5
కె.వి.పల్లి	8	రాయచోటి	14
లక్కిరెడ్డిపల్లె	6	సంబేపల్లి	7
మదనపల్లె	14	తంబళ్లపల్లె	6
ములకలచెరువు	5	టి.సుండుపల్లి	9
నందలూరు	8	వాల్మీకిపురం	6
నిమ్మనపల్లె	4	వీరబల్లి	9

వ్యక్తిపై కేసు నమోదు

కలికిరి : చిన్న పిల్లల అశ్లీలతను ప్రోత్సహించిన అనుమానితుడిపై కలికిరి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... ఈ ఏడాది జనవరి 20న చిత్తూరు పట్టణ పరిధిలో చైల్డ్‌పోర్న్ వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్, ఇతరులకు పంపినట్లు పోలీసులు గుర్తించారు. సుమోటోగా కేసు నమోదు చేశారు. సైబర్ టిప్‌లైన్స్ సుమోటో నివేదిక ఆధారంగా అనుమానితుడు కలికిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సంచరిస్తున్నట్లు సమాచారంతో కేసును చిత్తూరు పోలీసు ఉన్నతాధికారులు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదలాయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు కలికిరి ఏఎస్‌ఐ మధుసూదనాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దాడి చేసిన నలుగురిపై..

కలకడ : వ్యక్తిని కొట్టి గాయపరిచిన నలుగురిపై కేసునమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని కదిరాయచెర్వు గ్రామానికి చెందిన వెంకటేశును సోమవారం అదే గ్రామానికి చెందిన శ్రీనాథ, అతని భార్య సుజాత, వెంకట్రమణ, మల్లికార్జునలు కలిసి దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బత్యాల వాహనం ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన హర్షవర్ధన్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొటిక వారిపల్లి వద్ద చెంగలరాయుడు వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.దీంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి.. స్థానికుల కథనంమేరకు తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగలరాయుడు మండల పరిధిలోని పత్రపల్లిలో జరుగుతున్న ఓ క్రీడా కార్యక్రమానికి కారులో బయలుదేరాడు. అదే సమయంలో చింతరాజుపల్లి వైపు నుంచి స్కూటీలో ఇద్దరు యువకులు వస్తున్నారు. కొటిక వారిపల్లి వద్ద చెంగలరాయుడు వాహనం బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌లో వస్తున్న వారిలో హర్షవర్ధన్ అనే యువకుడికి కాలు విరిగింది. అతన్ని వెంటనే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రిమ్స్‌కు మహర్దశ


ప్రభుత్వ సర్వజనవైద్యకళాశాల (రిమ్స్) భవనం

- పెరిగిన పీజీ వైద్యవిద్య సీట్లు
- తాజాగా 20 విభాగాలకు అందుబాటులో 106 సీట్లు
- ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

కడప అర్బన్ : జిల్లా ప్రజలకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వైద్య వరాన్ని అందించారు. అదే ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్). 230 ఎకరాల విస్తీర్ణంలో, రూ. 180 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. 2006–2007 విద్యాసంవత్సరంలో 150 వైద్య విద్య (ఎంబీబీఎస్) సీట్లతో 149 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. దినదినాభివృద్ధి చెందుతూ 2013 నుంచి పీజీ స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం 20 విభాగాల్లో మొత్తం 106 పీజీ సీట్లు రిమ్స్‌లో ఉన్నాయి.దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

డాక్టర్ వైఎస్ఆర్ సంకల్పం గొప్పది..

ముఖ్యమంత్రిగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పదవీలోకి వచ్చినప్పటి నుంచి జిల్లా ప్రజలకు మేలు చేయాలనే దృఢసంకల్పంతో కడప లో ప్రభుత్వం తరపున వైద్యకళాశాలను స్థాపించాలని నిర్ణయించారు. ఏపీఎంఎస్ ఐడీసీ ద్వారా 2005 ఏడాది చివరిలో రిమ్స్‌కు శంకుస్థాపన చే శారు.తర్వాత ఏడాది కాలంలోనే నిధులను మంజూరు చేసి భవనాలను నిర్మించారు. పరికరాలను ఏర్పాటు చేయించారు. 2006–07 వైద్య విద్యాసంవత్సరం ప్రారంభమైంది. 2007 సెప్టెంబర్ 5న అప్పటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ చేతుల మీదుగా కడప రిమ్స్‌ను ప్రారంభించారు. అదే సమయంలో కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు శంకుస్థాపన చేయించారు. పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్యసేవలను అందించాలనే సంకల్పంతో 'సెమీ అటానమస్' విధానాన్ని తీసుకుని వచ్చి వైద్యులను, సిబ్బందిని విరివిగా తీసుకొచ్చారు. రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేశారు.

ఇవీ విశేషాలు..

- 2011లో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ విద్యార్థులు వైద్య విద్యను పూర్తి చేసుకున్నారు. ఇప్పటివరకు 12 బ్యాచ్‌ల వారు మొత్తం 1874 మంది వైద్య విద్యను పూర్తి చేసుకున్నారు. మొత్తం 16 బ్యాచ్‌లకు గాను 2472 మంది వైద్య విద్యలో చేరారు.
- 2019–20 నుంచి ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్ వీకర్స్ సెక్షన్) కింద మరో 25 వైద్య విద్య సీట్లను పెంచారు. దీంతో 150 నుంచి 175కు చేరుకున్నాయి.
- పీజీ వైద్య విద్య కోసం 2012లో అప్పటి ఎంసీఐ(మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా)కు ప్రతిపాదనలను పంపించారు. 10 విభాగాలకుగాను 44 పీజీ వైద్య సీట్లు దశలవారీగా మంజూరయ్యాయి. పీజీ వైద్య విద్యార్థులు 2013–14 బ్యాచ్‌లో చేరగా ఇప్పటివరకు 194 మంది పీజీ వైద్య విద్యను పూర్తి చేశారు.

తండ్రి బాటలోనే తనయుడు..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి రాగానే జిల్లా ప్రజలకు వైద్య విద్యను అందించేందుకు కృషి చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత రిమ్స్ అంతగా అభివృద్ధికి నోచుకోలేదు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో పయనిస్తూ రిమ్స్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు. రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ హాస్పిటల్, మానసిక వైద్య కళాశాలల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. భవనన నిర్మాణ పనులను వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ప్రస్తుతం 10 విభాగాలకుగాను 62 పీజీ వైద్య విద్య సీట్లు మంజూరు కావడానికి రాష్ట్ర ప్రభుత్వం, కడప రిమ్స్ వైద్య కాశాల అధికారుల కృషి ఎంతో ఉంది.

2013 నుంచి ఇప్పటి వరకు వచ్చిన పీజీ సీట్లు

విభాగం పేరు	మంజూరైన సీట్లు
అనాటమీ	02
ఫిజియాలజీ	02
జనరల్ మెడిసిన్	12
జనరల్ సర్జరీ	03
ఆర్థోపెడిక్స్	03
గైనకాలజీ (ఓ.బీజీ)	07
పిడియాట్రిక్స్	03
ఈఎన్‌టీ	03
ఆప్తమాలజీ	03
అనస్తీషియా	06
2023లో మంజూరైన పీజీ వైద్య విద్య సీట్లు	
సైక్రియాట్రీ	05
ఫోరెన్సిక్ మెడిసిన్	05
రేడియేషన్ అంకాలజీ	05
ఎస్‌పీఎం	09
ఫార్మకాలజీ	07
పెథాలజీ	07
మైక్రోబయాలజీ	09
పల్మనరీ మెడిసిన్	05
రేడియాలజీ	05
ఎమర్జెన్సీ మెడిసిన్	05

అందరి సహకారంతోనే అభివృద్ధి



ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ వైద్య విద్య ప్రారంభం నుంచి ఇప్పటివరకు 12 బ్యాచ్‌లు యూజీ పూర్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం, రిమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయా విభాగాధిపతులు, వైద్యులు, వైద్య సిబ్బంది, పరిపాలనా సిబ్బంది సహకారం వల్లే రిమ్స్ అభివృద్ధి సాధ్యమవుతోంది. పీజీ సీట్లు పెరగడం వల్ల ప్రజలకు సంపూర్ణంగా వైద్య సేవలను అందించేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. – డాక్టర్ అవిలేలి సురేఖ, ప్రిన్సిపాల్, కడప రిమ్స్

బీటీ కళాశాలకు పూర్వవైభవం దిశగా కృషి

- ఎమ్మెల్యే నవాజ్ బాషా


ఎమ్మెల్యే నవాజ్‌బాషాను సన్మానిస్తున్న బీటీ కాలేజీ ప్రొటెక్షన్ ఫోర్స్ సభ్యులు


మదనపల్లె : గత ప్రభుత్వాల్లో పాలకులు పట్టించుకోక అవసాన పరిస్థితుల్లో మూతపడే స్థితికి చేరుకున్న బీటీ కళాశాలను పట్టణ ప్రజలందరి కోరికమేరకు ప్రభుత్వ పరం చేయడమే కాకుండా పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బీటీ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి మార్పుచేస్తూ డాక్టర్. అనిబిసెంట్ యూనివర్సిటీకి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, యూనివర్సిటీ స్థాయికి పెంచాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా పలువురు విజ్ఞప్తి చేశారన్నారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తప్పకుండా ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదే విషయమై గతంలోని ప్రభుత్వాలు, పాలకులను అనేక పర్యాయాలు పూర్వవిద్యార్థులు, పట్టణ ప్రజలు వినతి చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బీటీ కళాశాల ఆస్తులు కాజేయాలనే నెపంతో ఉద్దేశపూర్వకంగా కోర్సులను ఎత్తివేసి, కళాశాలను మూసివేసే ప్రయత్నాలు జరుగుతూవచ్చాయన్నారు. పట్టణ ప్రజలు, పూర్వవిద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టడంతో ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేకంగా దీనిపై దృష్టిసారించారన్నారు. చెన్నైలోని బిసెంట్ సెంచునరీ ట్రస్ట్ సభ్యులతో పలుసార్లు సమావేశమై, వారందరినీ ఒప్పించి ప్రభుత్వానికి స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఆయన సహకారంతోనే నేడు బీటీ కాలేజీ ప్రభుత్వ కళాశాలగా మారిందన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం యూనివర్సిటీగా స్థాయి పెంచేందుకు ఎంపీ ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించామన్నారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి అక్కడికక్కడే హయ్యర్ ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ హేమచంద్రారెడ్డిని అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారన్నారు. వీలైనంత త్వరగా డాక్టర్.అనిబిసెంట్ యూనివర్సిటీ అంశాన్ని కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో తీర్మానం చేయించి జీఓ విడుదల చేయనున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలకు పనిలేక ప్రభుత్వ పనితీరుపై, సీఎం పాలనపై పసలేని విమర్శలు చేస్తున్నాయని, వాటిని తాము పట్టించుకోమన్నారు. డాక్టర్. అనిబిసెంట్ యూనివర్శిటీ ఏర్పాటుకు సహకరించిన ఎంపీ మిథున్‌రెడ్డికి మదనపల్లె పట్టణ ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.అనంతరం బీటీ కాలేజీ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆకులకిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషాను ఘనంగా సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు డిష్‌రామకృష్ణారెడ్డి, మేస్త్రీశ్రీనివాసులు, బి.ఏ.ఖాజా, వసీం, శివారెడ్డి, ఈశ్వర్ నాయక్, ఎస్వీ.రమణ, పాల్‌చంద్రశేఖర్, రాజేష్, రేణుక, రామిశెట్టిశివయ్య, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, సదాశివరెడ్డి, చందూరెడ్డి, ఆంజనేయులు, మునిశేఖర్, ఇస్మాయిల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కుడి చెరనుంచి భూమి స్వాధీనం


అంగళ్లు- సీటీఎం మార్గంలోని భూమిలో హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

కురబలకోట : అక్రమార్కుడి చెరలో ఉన్న భూమిని ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కురబలకోట రెవెన్యూ అధికారులు బుధవారం వెల్లడించిన కథనం మేరకు.. 15 ఏళ్ల క్రితం మదనపల్లెకు చెందిన డి. వరదరాజకుమార్ మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన దళిత సామాజిక వర్గం వారి నుంచి 782/1 సర్వే నంబరులో 8.45 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు.అప్పట్లో తక్కువ ధర ఉన్న భూమి ఇప్పుడు రూ. కోట్లకు చేరింది. ఈ భూమి రిజిస్టర్ కూడా అయింది. ఇది రెవెన్యూ రికార్డుల్లో డీసీ రిజర్వుడ్ ల్యాండ్ (అణగారిన తరగతికి చెందిన వారి)భూమిగా ఉంది. ఇది ఎస్సీ, ఎస్టీలకు తప్ప ఇతరులకు క్రయ విక్రయాలకు వర్తించదు. ఒక వేళ చేతులు మారినా ఆ సామాజిక వర్గానికి చెందిన వారికే చెందాలి. అయితే డీసీ ల్యాండ్ కొన్న వరదరాజ్ కుమార్ ఆర్థికంగా బలవంతుడు కావడంతో వన్‌బీ, పాసుబుక్కుల కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. తహసీల్దారు మొదలుకుని ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్, సీసీఎల్ఆర్ వరకు కూడా విశ్వ ప్రయత్నం చేశారు. ప్రతి చోట ఆయన క్లైయింను అధికారులు తిరస్కరించారు. చివరకు రిజిస్టర్ పత్రాలతో హైకోర్టును ఆశ్రయించాడు. డీసీ రిజర్వ్‌డ్ భూమి అని చూపకుండా మోసపూరితంగా వన్‌బీ, పట్టాదారు పాసుబుక్కుల కోసం పిటిషన్ వేశాడు. రిజిస్టర్‌భూమి కావడంతో పరిశీలించి హక్కులు కల్పించాలని హైకోర్టు గైడ్ లైన్స్ ఇచ్చింది. దీన్ని అవకాశంగా తీసుకుని ఆనాటి రెవెన్యూ శాఖ ఉద్యోగులు.. అప్పటి తహసీల్దారు నీలమయ్యను కూడా ఏమార్చి సంతకాలు చేయించారు. పైగా ఈభూమిపై కోర్టులో కేసు కూడా నడుస్తోంది. లక్షల్లో ప్రలోభాల పర్వం నడిచినట్లు సమాచారం. దీంతో అక్రమార్కుడికి ఖాతా నంబరు 2009 కింద పట్టా భూమిగా వన్‌బీ, పట్టాదారు పాసుబుక్కులు చేతికి వచ్చాయి. అప్పటి నుంచి ఈ వివాదాస్పద భూమిని అమ్మి సొమ్ము చేసుకోడానికి వరదరాజ్‌కుమార్ బేరసారాలు సాగించాడు. రియల్ రేటు ప్రకారం ఈ భూమి 8 కోట్లు దాకా పలికే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో భూ స్థితిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన విచారణకు ఆదేశించారు. మోసపూరితంగా లావాదేవీలు జరిగినట్లు, అక్రమంగా వన్‌బీ, పట్టాదారు పాసుబుక్కులు పొందినట్లు విచారణలో వెల్లడైంది. సదరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆభూమిలోకి ఎవ్వరూ ప్రవేశించరాదని బోర్డు నాటినట్లు తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు బుధవారం వెల్లడించారు. 15 ఏళ్లుగా అక్రమాన్ని సక్రమం చేయాలని భూమి కొన్న వరదరాజ్ కుమార్ పడిన పాట్లు బూడిదలో పోసిన పన్నీరైంది.

వెబ్‌ల్యాండ్‌లో వివరాలు తొలగింపు



విలువైన ఈ భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో భూ వివరాలు తొలగించాం. వన్‌బీ, పట్టాదారు పాసుబుక్కులను రద్దు చేశాం. ఆన్‌లైన్‌లో కూడా వరదరాజ్‌కుమార్ పేరుతో ఉన్న భూ వివరాలను తొలగించాం. ఈ భూమి ప్రభుత్వ స్వాధీనంలో ఉంది. ఎవ్వరూ ప్రవేశించరాదు. హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశాం. అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవు. – ఎం. భీమేశ్వరరావు, తహసీల్దారు, కురబలకోట

విద్యార్థి ఆత్మహత్య

బ్రహ్మంగారిమఠం : మండలకేంద్రమైన బి.మఠంలోని తెలుగు గంగ కాలనీలో మంగళవారం రాత్రి వాజిత్‌బాషా(17) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ విద్యాసాగర్ కథనం మేరకు వివరాలు.. బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న గౌస్‌భాషాకు ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు ఇంటర్ లో పాస్‌కాలేదు. అయినా తల్లిదండ్రులు ఏమీ అనలేదు. వాజిత్‌బాషా స్నేహితులతో కలిసి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నాడు.ఏమి అనుకున్నాడో ఏమో మంగళవారం రాత్రి ఇంటి బయట తల్లిదండ్రులు నిద్రిస్తుండగా ఇంటలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున నిద్రలేచి లోపలికి వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నట్లు తల్లిదండ్రులు తెలిపారని ఎస్‌ఐ చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్‌కు పంపిచినట్లు చెప్పారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వక్కలపేటలో సచివాలయం 37/1లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ఓనమ్ నాగలక్ష్మిపై గత నెల 24న ఆమె భర్త అంజనేయులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కర్నూలుకు చెందిన అంజనేయులుకు, మైదుకూరుకు చెందిన తనకు 2012లో వివాహమైంది. పిల్లలు లేరనీ తన భర్త రోజూ మద్యం తాగి వచ్చి వేధింపులకు గురి చేసేవాడు, వరకట్న వేధింపుల కోసం దాడి చేసేవాడు. ఈక్రమంలోనే తాను విధుల్లో వుండగా వచ్చి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం ఆదేశాల మేరకు ఎస్‌ఐ జయరాములు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

చెట్టుపై నుంచి పడి రైతుకు గాయాలు

మదనపల్లె : చెట్టుపై నుంచి పడి రైతు గాయపడిన సంఘటన బుధవారం పీటీఎం మండలంలో జరిగింది. కందుకూరు పంచాయతీ పట్టెంవాండ్లపల్లెకు చెందిన టి.రామచంద్ర (60) తమ వ్యవసాయ పొలం వద్ద మామిడికాయలు కోసేందుకు తోటలోని మామిడిచెట్టు ఎక్కాడు. అయితే అకస్మాత్తుగా కొమ్మ విరిగిపో వడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భుజం ఎముక దెబ్బతిన్నట్లు గుర్తించారు.

అనాథ వృద్ధురాలి మృతి


గౌరమ్మ మృతదేహం

మదనపల్లె : కుటుంబ సభ్యులు వదిలించుకోవడంతో, అనాథగా మారి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరక యాతన అనుభవిస్తున్న వృద్ధురాలు గౌరమ్మ (65) బుధవారం మృతి చెందింది. ఏప్రిల్ 25వ తేదీన పీటీఎం మండలం మల్లెల గ్రామంలో గౌరమ్మ అపస్మారకస్థితిలో పడి ఉండగా గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చారు.వారు వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో ఒంటరిగా చికిత్స పొందుతోంది. తన పేరు గౌరమ్మ అని, భర్త పేరు నారాయణ అని మాత్రమే చెప్పారు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో అనాథగా ఆసుపత్రిలో అసువులు భాసింది. ఆమె మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఆసుపత్రికి వచ్చి సంప్రదించాలని మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చింతపర్తి వాసి బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి పంచాయతీ కోటపల్లికు చెందిన ఎం.మురళి (36) గ్రామంలో చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఏప్రిల్ 29వ తేదీన సరుకుల కోసం మదనపల్లెకు వస్తూ భార్య తులసి స్వగ్రామమైన పోతబోలు పంచాయతీ సిద్దమ్మగారిపల్లెకు వెళ్లేదుకు మదనపల్లె – తిరుపతి జాతీయ రహదారిలోని శానిటోరియం వద్ద తురకపల్లె బస్టాప్‌లో దిగాడు. సిద్దమ్మగారిపల్లెకు నడుచుకుంటూ వెళుతుండగా మరో వ్యక్తి ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి మురళిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ రమాదేవి ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరసన్నగారిపల్లి గ్రామంలో కనిపించకుండా పోయిన శ్రీకాంత్ అనే యువకుడు దొరికాడని బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు సోమవారం నరసన్నగారిపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్య కుమారుడు శ్రీ కాంత్ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.ఒంటిమిట్ట పోలీసులకు గువ్వల చెరువు వద్ద బుధవారం యువకుడు శ్రీకాంత్ దొరికినట్లు తెలిపారు. శ్రీకాంత్, తల్లిదండ్రులను పిలిపించి ఎస్‌ఐ మధుసూదన్ రావు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారని తెలిపారు.

సెలవులను ఆమోదించని తహసీల్దార్‌పై కేసు

ఒంటిమిట్ట : వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో మండలంలోని నరవకాటిపల్లి వీఆర్‌వోగా పనిచేసిన తప్సూన్ (ప్రస్తుతం వీరపునాయునిపల్లి వీఆర్‌వో) అనివార్య కారణాల వల్ల నెల రోజులు సెలవు పెట్టారు. అయితే వాటిని ఆమోదించమంటూ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో ఆయన తనను మానసిక క్షోభకు గురిచేశాడంటూ తప్సూన్ తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్ రావు తెలిపారు.

యువతి అదృశ్యం

సంబేపల్లె : యవతి అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు. ఎస్‌ఐ వివరాలమేరకు గురిగింజకుంట పంచాయతీ ఎర్రకాలువపల్లెకు చెందిన యువతి బుధవారం తెల్లవారు జాము నుంచి కనిపించలేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

ములకలచెరువు : పొలం పనులు చేసుకుంటున్న మహిళను పాము కాటువేయడంతో అస్వస్థతకు గురైంది. ఈ సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... మండలంలోని వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన డి.రేణుక(25) తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా పాము కాటువేసింది. దీనితో అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె చికిత్స పొందుతోంది.